శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త



# జూన్ నెలాఖరుకల్లా మార్కెట్ నిర్మాణం పూర్తి

## - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి





**బుచ్చి మే 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని కూరగాయాల మార్కెట్ నిర్మాణాన్ని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జూన్ నెలాఖరుకల్లా మార్కెట్ నిర్మాణం పూర్తి అవుతుందని తెలిపారు. మార్కెట్ రోడ్డు ను కూడా 40 అడుగులు రోడ్డుగా చేయమని నాయకులకు సూచించారు. మార్కెట్ నిర్మాణం పూర్తి అయితే వ్యాపారస్తులందరికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ నేపద్యంలో పందులు మోపుకొని జీవనం సాగించేవారు తమకు నివాసయోగ్యమైన స్థలాలు కావాలని కోరాగా. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కొద్ది రోజులలో ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, కమీషనర్ బాలకృష్ణా, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, మోర్ల మురళీ, కౌన్సిలర్ బెల్లం మల్లారెడ్డి, చీర్ల ప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ , శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, రాష్ట్ర చైర్మన్ డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి, బత్తల హరికృష్ణా, సూరా శ్రీనివాసులురెడ్డి, వల్లూరు శ్రీనివాసులు, సొల్టేటి ప్రభాకర్, మైనార్టీనాయకులు పఠాన్ మహబూభాషా, కౌన్సిలర్ రహమత్, మైనార్టీనాయకులు సుభాన్,

# పురిటిపిల్లల ఐసీయూ ప్రారంభించిన ఆరోగ్య శాఖ మంత్రి





**నెల్లూరు, మే 3, ప్రభాతవార్త -వైద్యం** సింహపురి వైద్య సేవ సమితి రిజిస్టర్ ట్రస్టు ఆధ్వర్యంలో జై భారత్ హాస్పిటల్ నందు పురిటి పిల్లల ఐసీయూ నూతనంగా ప్రారంభించడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ వైద్య ఆరోగ్య, వైద్య విద్యశాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్ ముఖ్య అతిధిగా విచ్చేసి పురిటి పిల్లల ఐసీయు ప్రారంభించడం జరిగింది. ఆ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సింహపురి వైద్య సేవా సమితి ట్రస్టు స్థాపించిన 40 సంవత్సరాలకు పైగా పేదలకు, సామాన్యులకు అందుబాటులో అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైనటువంటి వైద్యం అందించడం ద్వారా జయభారత హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్నామని ఇంకా అనేక సేవా కార్యక్రమాలు దాతల సహకారంతో జయభారత హాస్పిటల్ వారు నిర్వహిస్తున్నారని ఇంకా ఎన్నో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని, అందుకు తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన మద్యం విధానంలో నాసిరకం మద్యం విక్రయించడం కారణంగా సదరు నాసిరకం లిక్కర్ తగిన ప్రజలు డయాలసిస్ భారిన పడి బాధపడుతున్నట్లు గుర్తించినందుకు వారి బాధలు అర్థం చేసుకున్న ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ 10 నెలల కాలంలోనే 18 నూతన డయాలసిస్ కేంద్రాలు ప్రారంభించడం జరిగింది. అందులో భాగంగా వింజమూరు, పొదలకూరులో డయాలసిస్ యూనిట్లు ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలోనే వెంకటగిరిలో కూడా డయాలసిస్ యూనిట్ ప్రారంభిస్తామని చెప్పారు. అందుకు గాను ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ఫ్రోగ్రాం ఎంతో ఉపయుక్తమైందని తెలిపారు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో కేవలం 45 డయాలసిస్ కేంద్రాలు మాత్రమే ఏర్పాటు కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 10 నెలల కాలంలో ఏకంగా 18 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసి బాధితులకు సేవ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# కాలవపై మరలా ప్రారంభమైన ఆక్రమణలు

## ఎమ్మెల్యే చెప్పారని పనులు ప్రారంభం



**కోవూరు, మే 3, ప్రభాతవార్త :** ప్రస్తుతం సైడు కాలువలు , డ్రైన్లు మరమ్మతులు చేస్తూ గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చాలని ఒక వైపు కూటమి ప్రభుత్వం చెబుతున్నా సంబంధిత నేతల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. పంచాయతీ డ్రైన్లు సైతం ఆక్రమించి షాపుల నిర్మాణానికి ఓ అధికార పార్టీ నేత శనివారం శ్రీకారం చుట్టారు. ఎవరైనా వెళ్లి ఏమయ్యా ఈ కాలువలో ఎందుకు కడుతున్నావంటే ఎమ్మెల్యే చెప్పారు.. కట్టుకుంటున్నామని నిర్లక్ష్యంగా చెప్పడం గమనార్హం. ఈ పరిస్థితి ఎక్కడా మారుమూల ప్రాంతాల్లో కాదు.. నియోజకవర్గంకు మండల కేంద్రం అయిన కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రాంతానికి చెందిన ఓ అధికార పార్టీ నేత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తల్లోనే ఈ కాలువను ఆక్రమించి షాపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. అప్పట్లో పంచాయతీ కార్యదర్శి తహసీల్దార్ సూచనల మేరకు ఈ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అప్పటి నుంచి ఆరు నెలల పాటు ఎటువంటి నిర్మాణం చేపట్టకుండా ఉన్న ఈ అధికార పార్టీ నేత మరలా శనివారం ఆ ప్రాంతంలో జేసీబీ ద్వారా శుభ్రం చేయించి షాపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కోవూరు ఎమ్మెల్యే ఈ ప్రాంతంలో కట్టుకోమని చెప్పారు.. అందుకే కడుతున్నానని ఈ మేరకు చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి కాలువలు ఆక్రమణకు గురి కాకుండా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మంత్రి సత్యకుమార్‌ను సన్మానించిన చల్లా, అంకినపల్లి



**వింజమూరు, మే 3, ప్రభాతవార్త** వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను శనివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ ఎఫ్సీఐ డైరక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన ఈ ప్రాంతానికి పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేసి మీ చేతుల మీదుగా ప్రారంభించడం మా ప్రాంత వాసుల అదృష్టమని వారు తెలిపారు.



# కండలేరులో 45.132 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, మే 3 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో శనివారం ఉదయం నాటికి జళాశయంలో 45.132 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండ లేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 270 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కుల చోప్పున మొత్తం 350 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

# మెట్ట ప్రాంతానికి ఆరోగ్య మంత్రి వరాల జల్లు





**వింజమూరు, మే 3, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం గత పది నెలలుగా వైద్య ఆరోగ్య రంగంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టినట్లుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శనివారం వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 5 పడకల డయాలసిస్ సెంటర్‌ను మంత్రి సత్య కుమార్ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా డయాలసిస్‌కు అవసరమైన పది లక్షల రూపాయలు విలువైన జనరేటర్‌ను ప్రారంభించారు. తరువాత కోటి 50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డయాలసిస్ సిస్టంను ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గం తన సొంత నియోజకవర్గం లాంటిదన్నారు. భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహచర్యంలో ఉదయగిరి నియోజకవర్గంలో ప్రత్యేక అనుబంధం నెలకొందన్నారు. ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ పథకం కింద గత ప్రభుత్వంలో 5 సంవత్సరాల కాలంలో కేవలం 21 ఏర్పాటు చేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పది నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 18 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. అందులో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మూడు డయాలసిస్ సెంటర్లు మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రంలో డయాలసిస్ రోగులు పెరుగుతున్న వైనంపై శాస్త్రీయంగా పరిశోధించామని, కేవలం గత ప్రభుత్వంలో నాణ్యతలేని మద్యం తాగడం వల్లనే కిడ్నీ కేసులు విపరీతంగా పెరిగినట్లు గమనించామన్నారు. గత ప్రభుత్వం ప్రజారోగ్యంతో చెలగాటమాడటంతో కొన్ని వేల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడ్డాయన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం నాణ్యమైన మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద 4200 కోట్ల రూపాయల నిధులను వ్యయం చేస్తున్నామన్నారు. అదే విధంగా స్టెమి కార్యక్రమం ద్వారా దాదాపు 2800 మంది ప్రాణాలు కాపాడామన్నారు. గుండెపోటుకు గురైన వారికి గోల్డెన్ అవర్‌లో అందించేందుకు 45000 ఖరీదు చేసే ఇంజక్షన్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అదే విధంగా నాలుగు కోట్ల పది లక్షల మందికి ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని, ఇప్పటి వరకు మూడు కోట్ల మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. వివిధ రకాల క్యాన్సర్లను ప్రాధమిక దశలోనే గుర్తించినట్లయితే ప్రాణాలు కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు. అందుకోసమే ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్లు పెట్టేందుకు నిర్ణయించామన్నారు. అదే విధంగా ఉదయగిరి నియోజకవర్గంలో పీపీపీ పద్దతిలో 100 నుండి 200 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించేందుకు అనుమతిస్తున్నామన్నారు. అనంతరం ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించే ఏకైక ప్రభుత్వం తమదన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి శాఖలో ఎన్నో విధాల మార్పులు తెచ్చారన్నారు. ముఖ్యంగా కార్డియాలజిస్టు అయిన వారి విషయంలో 4500 ఖరీదు చేసే ఇంజక్షన్లను ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో ఉంచి ఉచితంగా అందజేయడం గొప్ప విషయమన్నారు. అలాగే నియోజకవర్గంలోని 83 విలేజ్ క్లీనిక్‌లో పని చేసే సిబ్బంది అలసత్వం వీడి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అదే విధంగా ఉదయగిరి జిల్లా కేంద్రంనకు సుదూరంగా ఉన్న దృష్ట్యా ఆరోగ్యపరంగా మరిన్ని వసతులు కల్పించాలని విన్నవించారు. అదే విధంగా మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కంభం విజయరామిరెడ్డి ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు పి.చంచల బాబు యాదవులు మాట్లాడుతూ అతి పెద్ద మండలం అయినా వింజమూరులో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాగే ఉదయగిరి సీహెచ్‌సీ కూడా మరో డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేస్తే ఆ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా భావించి పరిపాలన సాగిస్తుందని తెలిపారు. రానున్న నాలుగేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా, నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, డీసీహెచ్‌ఎస్ మునుస్వామి, ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి మేకపాటి శాంతి కుమారి, మన్నేటి వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య, మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, అంకనపల్లి ఓబుల్‌రెడ్డి, గూడా నర్సారెడ్డి, గణపవరం సుదర్శన్‌రెడ్డి, వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, ఆనంగి రమణయ్య, ఎంపీటీసీ సభ్యురాలు భవాని, వనిపెంట హైమావతి, సాధం మౌనిక, వైద్యశాఖ కమిటీ సభ్యులు సంపూర్ణమ్మ, జయలక్ష్మీ, ఎమ్మెస్ నాయుడు, జిల్లా బీజేపీ అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు భరత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పులిచెర్ల వెంకట నారాయణరెడ్డి, మండల అధ్యక్షులు దేగ మధుయాదవ్, జనసేన మండల అధ్యక్షులు బండారు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెలుగోటి సురేష్, ఇతర తెలుగుదేశం, బీజేపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# రైతులకు గిట్టుబాటు ధర అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

## మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి





**మర్రిపాడు, మే 3, ప్రభాతవార్త :** లక్షలు ఖర్చు చేసి పండించిన పొగాకు పంటకు సరైన ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని గత వైసిపి ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకున్నామని గిట్టుబాటు ధర లేకుంటే మార్ క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని, ప్రస్తు కూటమి ప్రభుత్వం కూడా రైతులకు గిట్టుబాటు ధర అందించేలా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు.

మర్రిపాడు మండలం డిసిపల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పొగాకుబోర్డు వేలం కేంద్ర నిర్వహణాధికారి రాజశేఖర్, పొగాకు రైతులతో ఆయన గిట్టుబాటు ధరలు, సమస్యలపై చర్చించారు. పొగాకు వేలంప్రక్రియను పరిశీలించి నిర్వహణాధికారికి వినతిపత్రం అందజేశారు. రైతులకు వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. డిసిపల్లి పొగాకువేలం కేంద్ర పరిధిలో జిల్లాలోని 16మండలాలకు చెందిన సుమారు 2200మంది రైతులు తమ పొగాకు ఉత్పత్తులను విక్రయించేందుకు వస్తుంటారన్నారు. ఈ ఏడాది పొగాకు మార్కెట్ ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. రైతులకు సాగు వ్యయం , కూలిఖర్చులు పెరగడంతో వారు అనేక వ్యయ ప్రయాసలతో పొగాఉ పంటను సాగుచేశారన్నారు. వేలం కేంద్రానికి తీసుకువచ్చిన సమయంలో రైతులకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని , ధరలు ఇలాగే కొనసాగితే ప్రతి రైతుకు 4నుంచి 5లక్షల వరకు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మెట్టప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో రైతులు పొగాకు పంటను నమ్ముకునే జీవిస్తున్నారని వారికి ఇలాంటి ధరలు లభించడంతో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారన్నారు. పొగాకు వేలం సీజన్ మూడునెలలు ఉన్న తరుణంలో కూటమి ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకొని 2200మంది రైతులను ఆదుకోవాలని పొగాకు తో పాటు వరికి కూడా గిట్టుబాటు ధర లభించక వాటిని పండించిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతారని కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణంవైపు చూపుతున్న శ్రద్ధ రైతులపై కూడా చూపి 10రోజుల్లో ఆశాజనకరంగా పొగాకు రైతులకు ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సిపి రాష్ట్ర పురపాలక విభాగ ప్రధాన కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, రాష్ట్ర నాయకులు బొర్రా సుబ్బారెడ్డి, , మర్రిపాడు వైసిపి మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, ఆత్మకూరు పట్టణ, మర్రిపాడు మండల వైదసిపి కన్వీనర్లు ప్రతాప్‌రెడ్డి, సి.హెచ్.వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా వైసిపి నాయకులు ఎం.హజరత్‌రెడ్డి, కె.ప్రసాత్‌పరెడ్డి, షి.హెచ్.నారాయణస్వామి, ఎం.రవీంద్రబాబు, మండల నాయకులు ఒ.కృష్ణారెడ్డి, యు.శ్రీనివాసులురెడ్డి, పి.కొండారెడ్డి ఎం.ప్రసాద్, ఖాదర్‌బాషా, డిసిపల్లి ఎంపిటిసిసభ్యులు పి.దొరసానమ్మ, సర్పంచ్ ఆర్.సుప్రజ గోపాల్‌రెడ్డి, , స్థానికనాయకులు , పొలగాకు రైతులు పాల్గొన్నారు.

# వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చర్యలు చేపట్టండి : కమిషనర్ వై ఓ నందన్

**నెల్లూరు కార్పొరేషన్,మే 3 ప్రభాతవార్త:** నెల్లూరుకార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ వై.ఓ నందన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని డివిజన్లలో తాగునీటి చేతి బోర్ల పనితీరును పరిశీలించి, అవసరమైన వాటికి రిపేర్లు చేయించాలని సూచించారు. చేతి బోర్ల మరమ్మతులకు అవసరమైన స్పేర్ పార్ట్స్, అదనపు సిబ్బందిని నియమించుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చేతి బోర్లు అవసరం లేని ప్రాంతాలలో వాటిని పూర్తిగా తొలగించాలని తెలిపారు. అన్ని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు వాటి కెపాసిటీకి తగినట్లుగా నిండేలా చర్యలు తీసుకొని, అనంతరం తాగునీటి సరఫరా చేపట్టాలని సూచించారు. వైయస్సార్ నగర్ పరిధిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న కారణంగా తాగునీటి ట్యాంకర్ల సరఫరా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన మార్గాల్లోని డివైడర్లపై ఉన్న పచ్చదనాన్ని పరిరక్షించేందుకు ట్యాంకర్ల ద్వారా కాకుండా డ్రిప్ సిస్టం నీటి సరఫరా విధానాన్ని అవలంబించాలని, ఈ నెల చివరి నాటికి ఆ విధానాన్ని అందుబాటు లోకి తీసుకురావాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని బహిరంగ ప్రదేశాలలో చలిటి ప్రాంతాలలో పశుపక్షాదులు దాహార్తిని తీర్చుకునేం దుకు వీలుగా చిన్నపాటి ఏర్పాట్లను చేయాలని సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో మేజర్, మైనర్ డ్రైన్ కాలువల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని, వాటి నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు నివేదించాలని కమిషనర్ ఆదేశించారు. నగరవ్యాప్తంగా ఉన్న అన్ని పార్కుల



లో పచ్చదనం, పర్యావరణానికి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ తాగునీటి కుళాయిల ద్వారా నీటి వృధా కాకుండా అన్ని డివిజన్లలో పర్యవేక్షించాలని, అవసరం లేని ప్రాంతాలలోని పబ్లిక్ ట్యాప్లను తొలగించాలని ఆదేశించారు. నీటి కుళాయి పన్నులను “వాడకాన్ని బట్టి చార్జీలు“ విధించడాన్ని కౌన్సిల్ సమావేశంలో ఉంచి ఆమోదించేలా ప్రతిపాదన రూపొందించాలని సూచించారు. అన్ని డివిజన్లలో అనధికారికంగా ఉన్న తాగునీటి కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించే పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్మోహన్ రావు, అధికారులు శేషగిరిరావు, రహంతు జానీ, శ్రీనివాసులు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రికి స్వాగతం పలికిన సోమిరెడ్డి



**నెల్లూరు, మే 3, ప్రభాతవార్త-వైద్యం** అల్లిపరంలోని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గృహానికి చేరుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మం( శ్రీసత్యకుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, నాయకులు

## బాలకార్మిక, వెట్టి చాకిరి పనులు చేయండం ప్రోత్సహించడం చట్టరిత్యా నేరం



**కోవూరు ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** 18 సంవత్సరాలు వయస్సు నిండిన బాలబాలికలను విద్యాభ్యాసం చేయనీయకుండా ఏదైనా పనిలో పెట్టడం కూలీ పనులు చేయించడం .... బాలి కార్మికులగా వెట్టి చాకిరి చేయించడం చట్టారీత్యా నేరమని,సమాజంలో ఎవరైనా బాల్య వివాహాలకు పాలుపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని అన్నారు. బాలికల భద్రత మహిళల రక్షణే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తు బాలికల పట్ల అగౌరవంగా అమర్యాదకరంగా ప్రవర్తిస్తే పోక్సో యాక్ట్ మరియు జువినైల్ జస్టిస్ యాక్ట్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటారని,మానవ అక్రమరవాణాకు పాల్పడే ముఠాపట్ల బాలబాలికలు మహిళలు అ ప్రమత్తంగా ఉండాలని యాంటి హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ (ఎహెచ్టియు ) ఎస్ఐ వై.శ్రీహరి తెలిపారు. శనివారం సాయింత్రం కోవూరు మండలం గుమ్మళ్ళ దిబ్బ ఎస్టి కాలనీలో నెల్లూరు జిల్లా ఎస్పి బి.కృష్ణకాంత్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్పి శ్రీ కె సిహెచ్ రామారావు సిఐ శ్రీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మానవ అక్రమ రవణా, పోక్సొ యాక్ట్ మాదక ద్రవ్యాల దుర్వినియోగం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేఖంగా కాలనీ వాసులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలోఎ ఎహెచ్ఐటియు ఎఎస్ఐ డి సతీష్, సిబ్బంది, టీవిఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు పెద్దపీట

**..బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఉచిత లడ్లు పంపిణీ ..మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**



**పెంచలకోన(రాపూరు),మే3ప్రభాతవార్త :** శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాలలో సామన్య భక్తులకు పెద్దపీట వేయనున్నట్లురాష్ట దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం పెంచలకోనలోని పర్యటక శాఖ మండపంలో నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషి అనూషా ఆధ్వర్యంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్లరామకృష్ణ ఆధ్యక్షతన నిర్వహించిన బ్రహ్మోత్సవాల 3వ సమీక్షలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గోని శాఖల వారిగా బ్రహ్మోత్సవాలలో భక్తుల సౌకర్యార్థం నిర్వహించాల్సిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఈ నెల 8వ తేది నుండి 14వ తేది వరకు నిర్వహించనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ శాఖ వారు నిరంతరాయం విద్యుత్ సరఫరా వుండేలా చూడాలని కోరారు. ఆర్డబ్యూఎస్ శాఖ వారు భక్తులకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడటంతో పాటు, ప్రతి రెండు గంటలకు ఒక సారి తాగునీటి నాణ్యతను పరిక్షలు నిర్వహించి మంచి నిటీని భక్తులకు అందించాలని కోరారు. ఆర్ అండ్ బి శాఖ వారు ఆదూరుపల్లి నుండి పెంచలకోన వరకు దెబ్బతిన్న రోడ్లకు యుద్ద ప్రతిపాదికన మరమత్తులు నిర్వహించాలని పోన్ల్ ఆర్అండ్‌బీ ఎస్ఇకి సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ వారు భక్తులకు కావాలసిన మందులు,ఓఆర్ఎస్ ఫ్యాకెట్లు అందుబాటులో వుంచుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ వారు వారి వాహనంతో పాటు అగ్ని ఆర్పే పరికరాలను సిద్దంగా వుంచుకోవాలని కోరారు. పోలీసు శాఖ వారు సిసి కెమరాలతో పాటు, క్యూలైన్‌లలో తోపులాటలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఏక్సైజ్ శాఖ వారు బ్రహ్మోత్సవాల సమయంలో బెల్టు షాపులు లేకుండా చూడటంతో పాటు మద్యం అక్రమ నిల్వలపై తనిఖీలు నిర్వహించాలని కోరారు. మున్సిపల్ శాఖ వారు ఎక్కువ మంది పారిశుద్య సిబ్బందిని ఏర్పాటు చేసుకోని దేవస్థానం పరిసరాలు పరిశుభ్రంగా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**బ్రహ్మోత్సవాలలో భక్తులక ఉచిత లడ్డుల పంపిణీ**

ఈ పర్యాయం స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు బ్రహ్మోత్సవాలలో గరుడసేవ, కళ్యాణోత్సవం రోజులలో ఉచిత లడ్డులను అందించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్టంలోని అన్ని దేవాలయాలలో ఉత్సవాల సమయంలో ఉచిత లడ్డులు అందించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**సేవా కమిటీ హోదాగా కాకుండా స్వామి సేవగా భావించండి**

బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబందించి ఏమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ వినతి మేరకు రాష్ట ప్రభుత్వం బ్రహ్మోత్సవాల సేవా కమిటీ ఛైర్మన్‌గా చెన్ను తిరిపాల్ రెడ్డితో పాటు మరో 13 మంది సభ్యులుగా ఒక నాయిబ్రాహ్మణ, ఒక బ్రాహ్మణులతో కలసి కమిటీ వేయడం జరిగిందన్నారు. కమిటీ సభ్యులు వారి పదవులను హోదాగా భావించకుండా స్వామి వారి సేవ చేసేందుకు వచ్చిన అవకాశంగా బావించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసి భక్తుల మన్ననలు, ఎమ్మెల్యే మన్ననలు పొందాలని సూచించారు. ఈ సమావేశంలో సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, ప్రధానార్చకులు రామయ్య స్వామి,ఆలయ డిప్యూటీ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, జిల్లా దేవాదాయ సహయక కమీషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి, ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్, రాపూరు తహశిల్దార్ లక్ష్మినారాయణ, డిటీ అశోక్, ఆర్ఐ అరుణ్ తేజ, యంపీడీఓ భవాని, సిఐ సత్యనారాయణ, ఎస్ఐ వెంకట రాజేష్, వివిద శాఖల అధికారులు సేవా కమిటీ సభ్యులు పీర్ల సోమయ్య, తోట క్రిష్ణయ్య, రాపూరు మండల టిడిపి యువనేత చెన్ను అశోక్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కోండ్లపూడి రాఘవ రెడ్డి,నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, అకిలివలస సర్పంచ్ చెన్ను పెంచల రెడ్డి,పెద్ద ఎత్తున టిడిపి,జనసేన,బిజేపి నాయకులు వున్నారు.

## ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించి పంచాయితీకి సహకరించాలి

**రాపూరు,మే3ప్రభాతవార్త :** పంచాయితీని పరిశు భ్రంగా వుంచేందుకు పంచాయితీలోని ప్రజలు సహక రించాలని రాపూరు మేజర్ పంచాయితీ కార్యదర్శి కవిత కోరారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతా లలో జరుగుతున్న చెత్త తోలగింపు కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాం తాలలో ప్రజలతో మాట్లాడుతూ ప్రజలు చెత్తను చెత్త బుట్టలలో వేసుకోని పంచాయితీ వాహనం వచ్చిన ప్పుడు ఆ వాహనంలో చెత్తను వేసి సహకరిం చాల న్నారు. అలా కాకుండా చెత్తను రోడ్డుపై వేయడం ద్వారా వ్యాధులు ప్రభలే అవకాశం వుందన్నారు. ఎవరైనా రోడ్డుపై చెత్త వేస్తుంటే పోటో తీసి వాట్సాప్ చేస్తే పోటో పంపిన వారి పేరు గోప్యంగా వుంచి చెత్త వేసిన వారిపై చర్యలు చేపడుతామమన్నారు.పంచాయితీలో పారిశుధ్య సిబ్బంది కోరత వున్నప్పటికి ఎప్పటికప్పుడు చెత్తను తోలగించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రజలు పంచాయితీకి చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించి పంచాయితీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

## నృసింహుని సేవలో మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగోండ్ల



**పెంచలకోన(రాపూరు),మే3ప్రభాతవార్త:**ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామిని శనివారం రాష్ట దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణలు దర్శించుకున్నారు. కోనకు వచ్చిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి.వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణకి ఆలయ అర్చక స్వాములు,పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి వారిని, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారిని, శ్రీ అంజనేయ స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. తదుపరి స్వామి వారి ఆస్థాన మండపంలో వేదపండితులు వారికి వేదమంత్రాలతో ఆశీర్వచనాలు ఆందజేసి, స్వామి వారి తీర్థప్రసాదాలను ఆందజేశారు. మంత్రి వెంట ఆయన కుమార్తె ఆనం కైవాల్యారెడ్డి, నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషి అనుషా, పెంచలకోన దేవస్థానం సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కోండ్లపూడి రాఘవ రెడ్డి, రాపూరు మండల టిడిపి యువనాయకుడు చెన్ను అశోక్ రెడ్డి, నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మూరంరెడ్డి మదుసూధన్ రెడ్డి, సేవా కమిటీ సభ్యులు పీర్ల సోమయ్య, తోట క్రిష్ణయ్య, ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, జిల్లా ఎండోమెంట్ ఎసి కోవూరు జనార్దన్ రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు పెంచలయ్య స్వామి, రామయ్య స్వామి, అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, నాగరాజు స్వామి, వర్దన్ స్వామి, వినోథ్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులున్నారు.

## చెన్ను గార్డెన్స్‌లో చెన్ను సోదరులతో మంత్రి ఆనం మంతనాలు



**పెంచలకోన(రాపూరు),మే3ప్రభాతవార్త :** రాపూరు మండలంలోని తానంచర్ల గ్రామంలో వున్న చెన్ను గార్డెన్స్‌లో చెన్ను సోదరులైన పెంచలకోన సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, రాపూరు పిఏసిఎస్ మాజీ ఆధ్యక్షుడు చెన్ను బాస్కర రెడ్డి, రాపూరు మండల టిడిపి యువనాయకుడు చెన్ను అశోక్ రెడ్డిలతో రాష్ట దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శనివారం చెన్ను గార్డెన్స్‌కు వచ్చిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ, జిల్లా డిసియంఎస్ ఛైర్మన్ గంగోదు నాగేశ్వర రావు, చెన్ను సోదరులు శాలువా కప్పి,బోకేలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ,డిసియంఎస్ ఛైర్మన్ గంగోదు నాగేశ్వర రావు, తదితరులతో పలు విషయాలను చర్చించారు. మంత్రి వెంట ఆయన కుమార్తె ఆనం కైవల్యా రెడ్డి,చెన్ను సోదరులు,తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కోండ్లపూడి రాఘవ రెడ్డి, నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, చల్లా రఘురామి రెడ్డి, పలు గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు తదితరులున్నారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**పెంచలకోన(రాపూరు),మే3ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారు జామున 4.30కి స్వామి వారి మూల మూర్తికి అభిషేకంగోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ,చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి, అమ్మ వార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలం కరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గోని స్వామి, అమ్మవార్లను దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

## ఇసుక అక్రమ రవాణా పై చర్యలు తీసుకోవాలి

**– నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి డిఎస్పికి వినతి పత్రం అందజేసిన కోటంరెడ్డి**



**నెల్లూరు క్రైమ్, మే 3, ప్రభాతవార్త:** స్థానిక దీన్ దయాళ్ నగర్‌లో ఇసుక టిప్పర్లను పట్టించిన వ్యవహారంలో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల కోసం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొస్తే, కొందరు అక్రమార్కులు ఈ పాలసీని అడ్డంపెట్టుకుని దోచుకుంటున్నారని కోటంరెడ్డి మండిపడ్డారు. ఆ వ్యవహారం వెనుక ఎంతటి వారున్నా వదిలే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. గత ప్రభుత్వంలో వైసీపీ ఎమ్మెల్యేలు ఇసుకను కూడా పందికొక్కుల్లా దోచుకున్నారని ఆయన మండిపడ్డారు. వారు చేసిన అవినీతి అక్రమాల వల్లే వారికి ప్రజలు 11 సీట్లు ఇచ్చారన్నారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితం చేస్తే, కొందరు రాత్రి సమయాల్లో దోచుకుంటున్నారని మండిపడ్డారు. తానే రీచ్ వద్దకు వెళ్లి వాహనాలను అడ్డుకున్నానని, ఆ అక్రమ రవాణా వెనుక ఉన్న వారిని అరెస్టు చెయ్యాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు. భారీ యంత్రాలు, జేసీబీలతో కొందరు రాబంధులు పెన్నమ్మ గర్భానికి తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొంగూరు నారాయణకు చెడ్డపేరు తీసుకొచ్చేలా కొందరు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. నారాయణ పేరు చెప్పుకుని అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో మంత్రి నారాయణ గతంలో పలు మార్లు హెచ్చరించారని కోటంరెడ్డి గుర్తు చేశారు. ఇసుకాసురులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైమ్, మే 3, ప్రభాతవార్త :** మాధవసేత్తు రైల్వే ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన నగరంలోని విజయమహల్ రైల్వే గేట్ సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతుడు బ్లూ, వైట్ చెక్స్ గల ఫుల్ హాండ్స్ షర్ట్, సిమెంట్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి రైల్వే ఎస్పై హరిచందన కేసు దర్యాప్తు చేపట్టారు.

## అరాచకం పరాకాష్టకు చేరింది

**– కూటమి ప్రభుత్వంపై ఫైర్ అయిన నేదురుమల్లి**



**నెల్లూరు రూరల్, మే 3, ప్రభాతవార్త :** నో స్కీమ్స్ ఓన్లీ స్కామ్స్ సంపద సృష్టి పేరుతో స్కాంలు చేస్తున్నారంటూ వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. నెల్లూరు వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో వెంకటగిరి వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఆలోచన నుండి పుట్టిన వాలంటీర్ వ్యవస్థ గురించి ఎన్నిక లకు ముందు గౌరవ వేతనం 5 వేల నుండి 10 వేలు ఇస్తామని చెప్పి రాష్ట్ర వ్యాప్తంగా వున్న 2లక్షల పైన వాలంటీర్‌లను తొలగించారు. విజయవాడ వరదల సమయంలో ప్రజలు అందరూ వాలంటీర్‌లను తలచు కున్నారు. వాలంటీర్ ఇంచార్జ్‌గా నాగార్జునను నియమించారు. వెంకటగిరిలోనే ఈ ప్రక్రియ మొదలుపెట్టాం. జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలుకు పెద్దపీట వేస్తాం అన్నారు. పోలీసు స్టేషన్ లోనే కేసులు విచారణ తీర్పులు జరుగుతున్నాయి. వెంకటగిరి మున్సిపాలిటీలో ఛైర్ పర్సన్ పై పెట్టిన అవిశ్వాసం పెట్టిన కూటమి నేతలు ఓడిపోయారు. వెంకటగిరి నియోజక వర్గంలో ప్రభుత్వ భూములు లాక్కోవడం, ఇసుక కనిపిస్తే దోచుకోవడం పక్క రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. కలువాయి మండలం తెలుగురాయపురం, రాజుపాలెం వద్ద అక్రమంగా ఇసుక రీచ్ లు ఏర్పాటు చేసి రోడ్లు వేసి ఇసుక తరలిస్తూనే ఉన్నారు. అధికారులకు చెబితే తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టడం తప్ప చర్యలు లేవు. ఎంత దారుణం అంటే అక్రమ ఇసుక తరలిస్తున్న టిప్పర్ రోడ్డులో ఆగిపోతే ఆ విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లారు.అక్రమార్కులు భయపడే రోజులు పోయాయి, అధికారులు, ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. అక్రమ ఇసుక మొత్తం బెంగుళూరుకు తరలిస్తున్నారు. సైదాపురంలో క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ పై ఓ సినిమా తీయొచ్చు. అధికారికంగా మైన్స్ ఉన్న వారిని బెదిరించి 50 శాతం వాటా మాకే ఇవ్వాలి అంటూ మైన్ లు మొత్తం తమకే ఇస్తే వ్యాపారం చేసి వచ్చిన దానిలో 50 శాతం ఇస్తా అంటున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు మోనంగా ఉన్నట్టు, అడవుల్లో కూడా అక్రమ మైనింగ్ చేస్తుంటే మాట్లాడరా? కాకినాడలో సీజ్ ద షిప్ అన్న పవన్ సైదాపురంలో జరుగు తున్న అక్రమ మైన్ పై మాట్లాడాలి రౌడీ షీటర్‌లతో అక్రమ మైన్‌లు నడిపిస్తున్నారు. అక్రమ మైనింగ్ చేస్తే అనుమతులు అవసరం లేదు, అక్రమ ఇసుక తరలిస్తుంటే అనుమతులు అవసరం లేదు, కానీ అక్రమ మైన్‌లు సందర్శకోసం వెళుతున్న వైసిపి నాయకులను మాత్రం అనుమతులు తీసుకోవాలని పోలీసులు అడ్డుకుంటారు. ప్రధాన మంత్రి సభలో లోకేష్ స్టేజ్ మీద ఎందుకు కూర్చున్నారో? సంక్షేమ పథకాలు అమలు చేయకుండానేగతంలో కంటే ఎక్కువ అప్పులు చేశారు. ఆ డబ్బులు ఎక్కడకు పోయాయే చెప్పాల న్నారు. ఈ కార్యక్రమం లో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డితో పాటు సైదాపురం మండల కన్వీనర్ మనరవు రవి, వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, రాపూరు మండల కన్వీనర్ మధురెడ్డి, కలువాయి మండల కన్వీనర్ కృష్ణా రెడ్డి, నారాయణ రెడ్డి,శ్రీనివాసులరాజు మరి కొంతమంది మండల నాయకులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులు బీదని సత్కరించిన వైఈఎస్



**నెల్లూరు, మే 3, ప్రభాతవార్త-వైద్యం :** నూతనంగా ఏర్పడిన యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ద్వారా యాదవ పేద విద్యార్థులకు చేస్తున్న సహాయ సహకారాలని వివరించారు. అలాగే విద్యార్థుల్లో చైతన్యం తీసుకుని రావాలని, యాదవుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్ర, శ్రీనివాసులు ఆర్థిక కార్యదర్శి యనమల జానకిరామ్, యాదవ ఎంప్లాయిస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు, ఎస్ వ్యవస్థాపకులు డి.వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు మురళి, ఉడత వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సురేష్ కుమార్, సుకుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శాఖవరం సచివాలయం ఆకస్మిక తనిఖీచేసిన ఎమ్మెల్యే

## అందుబాటులో లేని సిబ్బంది-వివరణ కోరిన కలెక్టర్



**వలేటివారిపాలెం మే 3 ప్రభాతవార్త :** మండలంలోనిశాఖవరం సచివాలయాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీచేశారు.సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు.దీంతో ఒకరిద్దరు తప్ప మిగిలిన సిబ్బంది గైరుహాజరయ్యారు. ఎక్కడ విధులకు హాజరవుతున్న విషయం మూవ్‌మెంటు రిజిస్టర్‌లోగాని, అటెండెన్స్ రిజిస్టరల్‌గానీ నమోదు చేయలేదు.దీంతో ఇప్పటికే సచివాలయ సిబ్బంది పనితీరుపై విసుగు చెందిన ఎమ్మెల్యే సిబ్బంది పనితీరును జిల్లా కలెక్టర్‌కి వివరించారు.దీంతో కలెక్టర్ పూర్తి సమాచారంతో హాజరుకావాల్సిందిగా ఎంపీడీవో నరేంద్రదేవ్‌ని ఆదేశించారు.దీంతో శనివారం సాయంకాలం నుంచి ఆయన ఈ పనిలో నిమగ్నమైనారు.మండల సచివాలయాల సిబ్బందిలో చాలా మంది పనితీరు అధ్వానంగా ఉంది. నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. దీంతో ఇటీవల వార్త జిల్లా ఎడిషన్‌లో పలు కథనాలు వచ్చాయి. తెదేపా కార్యకర్తలుతోపాటు గ్రామస్తులు పలు సందర్భాలలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు సిబ్బంది పనితీరు పరిస్థితి బాగాలేదని వివరించారు.ఇందులో బాగంగా ఇటీవల పోకూరు సచివాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీచేశారు. సిబ్బంది గైరుహాజరులో ఉన్నారు.సంబందిత సిబ్బందికి మెమో జారీ చేశారు. అదేవిధంగా పోలినేనిచెరువు పంచాయ తీకార్యదర్శి గణేష్‌పై ఆ గ్రామ తెదేపా నేతలు ఎమ్మెల్యేకి పిర్యాదుచేశారు.పనితీరు మెరుగు పరుచుకో వాల్సిందిగా ఆయన పలు మార్లు పలు సభల్లో సిబ్బందికి సూచించారు. అధికారులుకు వివరించారు. అయినా శాఖవరం వీఆర్వో,సర్వేయర్, పోకూరు పంచాయతీకార్యదర్శి, వలేటివారి పాలెం, పోలినేని చెరువు,కలవళ్ల సచివాలయ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉంది.ఈనేపధ్యంలో ఎమ్మెల్యేతోపాటు ఉన్నతాధికారులు ఏసీబీ అధికారులు సైతం వీరి పనితీరుపై నిఘా ఉంచినట్లు తెలుస్తుంది. ఇందులో బాగంగా శనివారం ఆకస్మికంగా ఎమ్మెల్యే తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, శాఖవరం పాండు రంగారావుతోపాటు పలువురు ఉన్నారు.

## కూల్‌డ్రింక్స్ మానండి... సహజ పానీయాలు త్రాగండి...జెవివి నేతలు



**కావలి, మే03 ప్రభాతవార్త :** కూల్‌డ్రింక్స్ తాగకుండా సహజ పానీయాలు సేవించాలని జనవిజ్ఞానవేదిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ పిలుపునిచ్చారు. కావలి ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్‌లో శనివారం జెవివి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బెజవాడ మాట్లాడారు. శీతలపానీయాలు (కూల్‌డ్రింక్స్) అలవాటుగా సేవిస్తున్నట్లయితే స్థూలకాయం, కిడ్నీ, లివర్ సంబంధ వ్యాధులు, అధికరక్తపోటు, ఎముకలు పెళుసుబారిపోవడం, క్యాన్సర్, పురుషత్వలోపాలు, మధుమేహం, తదితర వ్యాధులు సంభవిస్తాయని ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. అందుచేత శీతలపానీయాలకు బదులుగా పండ్లరసాలు, నిమ్మరసం, చెరుకురసం, కొబ్బరినీళ్ళ, మజ్జిగ, పానకం, గంజి, రాగిఅంబలి, తదితర సహజపానీయాలు సేవించాలన్నారు. వీటివల్ల పోషకవిలువలు శరీరానికి ఎంతో ఆరోగ్యాన్నిస్తాయన్నారు. రైతన్నలకు ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన ఆళ్ల కోటేశ్వరరావుకు జెవివి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి అద్యక్షులు తోట వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, కోశాధికారి టి.సుబ్బరామశర్మ, జెవివి నేతలు ఆకుల రమణయ్య, పాపిశెట్టి జానకిరాం, జి.కళ్యాణి, రాయపాటి దిలీప్‌కుమార్, బాబ్జి, షేక్.జమీర్, కందికట్టు నారాయణ, శ్రీకర్ల వెంకయ్య, షేక్.ఖాదర్‌బాష, సి.కల్లయ్య, గాదిరెడ్డి మురళికృష్ణ, గుణకల శివయ్య, అమిరిశెట్టి హజరత్తయ్య, లోక్‌సత్తా మాలకొండారెడ్డి, న్యాయవాది సాయిప్రసాద్, దామిశెట్టి బాలసురేంద్రనాథ్, జాన్, పివియన్ సుధాకర్, మొగిలిశెట్టి జమున, ఎంవి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండ ఆదాయం రూ.11.8లక్షలు

**వలేటివారిపాలెంమే3, ప్రభాతవార్త:** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారిని శనివారం కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతోపాటు పలువురు భక్తులు దర్శించుకున్నారు. తద్వారా సా ్వమివారికి రూ.11,79,689ల మేర ఆదాయం సమకూరింది.ఆలయ ప్రధాన అర్చకులు గౌరీ భక్తులకు తీర్థప్రసాదాలు అ ందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ. 6,000లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.20,840లు, వివాహాల నిర్వహణ వలన రూ. 6,000లు,తలనీలాలు టిక్కెట్లు వలన రూ.72,375లు,వాహనపూజల వలన రూ.3,040లు, ప్రత్యేక దర్శనం రూ.4,35,200లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.680లు,రూముల అద్దెలు రూ.35,330లు,కవర్లు అమ్మకం వలన రూ.8,700లు,అన్నదానం నిమిత్తం రూ. 3,30,518లు, లడు ప్రసాదం అమ్మకాల వలన రూ.2,47,390లు విరాళాలు 13,616లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించినట్లు ఆలయ ఏసీ కెవి సాగర్‌బాబు తెలిపారు.

## కావలి శంకరమఠంలో శంకర జయంతి ఉత్సవాలు



**కావలి, మే03 ప్రభాతవార్త :** కావలి పట్టణ పాతవూరులోని శంకరమఠంలో శ్రీ జగద్గురు శంకరజయంతి ఉత్సవ వేడుకలు జరుగుతున్నాయి. శనివారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త హైదరాబాద్‌వాసి డాక్టర్ నందివాడ అనంతలక్ష్మి శివానందలహరిపై అద్భుత ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాసప్రవీణ అన్నదాత మణి తనదైన శైలిలో మాట్లాడి అందరిని ఆకట్టుకున్నారు. శంకరమఠం అధ్యక్షులు బసవరాజు శ్రీనివాసశర్మ, కార్యదర్శి గణపతిరాజు మారుతిరామారావు, ఉపాధ్యక్షులు టివిఎంఎన్ ప్రకాశరావు, కోశాధికారి కె.మధుసూధన్‌రావు, శంకరమఠం ప్రధానఅర్చకులు తెలికేపల్లి రామచంద్రయ్య, సహాయ అర్చకులు తెలికేపల్లి మల్లికార్జున, భక్తులు పాల్గొన్నారు.

## సీతారామచంద్ర స్వామికి ఘనంగా మహాకుంభాభిషేకం



**ఇందుకూరుపేట, మే 3, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం పల్లెపాలెంలో సీతారామచంద్రస్వామి మహా కుంభాభిషేకంలో మండల వైసీపీ కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరామచంద్రుని ఆశీస్సులు ప్రజలపై చల్లగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిగినం సుబ్రహ్మణ్యం, అంగ ఫకిరయ్య, తాంబూ వెంకటేశ్వర్లు, రామని ఉదయాద్రి, చంటి, వైసీపీ నాయకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నీతికథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలపై అవగాహన



**ఉలవపాడు, మే 3, ప్రభాతవార్త :** ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులను శనివారం నిర్వహించారు. ఈ శిక్షణలో విద్యార్థులతో నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్ మొదలగు పుస్తకాలు చదివించి, గ్రంథాలయ ప్రాముఖ్యత గురించి, పిల్లల్లో అవగాహన కల్పించడం జరిగిందని గ్రంథపాలకుడు డి.కోటేశ్వరరావు తెలిపారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు మజ్జిగ ప్యాకెట్లు అందించడం జరిగింది.

## మాలకొండలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం మే 3 ప్రభాతవార్త :** మండలంలోని శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహాస్వామివారిని శనివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించారు. స్వామివారిని దర్శించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 1982ఏడాది కందుకూరు జెడ్పీ హైస్కూలు 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు స్వామివారి అన్నదానకార్యక్రమానికి ఎమ్మెల్యే సమక్షంలో ప్రిజ్ బహుకరించారు.దీనిని అధికారులకు ఎమ్మెల్యే అందచేశారు.అదేవిధంగా ఈ నెల 17వ తేదీన స్వామివారి జయంతి కార్యక్రమానికి సంబందించిన గోడపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.అనంతరం ఆలయ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆలయ ఈవో సాగర్‌బాబుకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాని హర్షకుమార్,పార్టీనేతలు మన్నం కృష్ణ, వడ్డేళ్ల రవిచంద్ర, తలతోటి మస్తాన్,కూనం నరేంద్ర, ముచ్చు ఒంకారయ్య తదితరులు పాల్గొన్నారు.

## జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు పరుగుకు అంతరాయం

**బిట్రగుంట మే 3(ప్రభాతవార్త ):** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్ సమీపాన 143,144 ఎల్ సి గేట్ల వద్ద విజయవాడ వైపు వెళ్లే జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు శుక్రవారం రాత్రి పరుగుకు స్వల్ప అంతరాయం కలిగింది ఎల్ సి గేట్ల సమీపంలో ఎక్స్‌ప్రెస్ రైలు గేదెలను ఢీకొనడంతో పరువుకు అంతరాయం కలిగింది.

## వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ



**దగదర్తి, మే 3, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు దగదర్తి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరి ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్, రోటావేటర్, ఆఫ్‌వీల్స్ వ్యవసాయ ఉన్నత అధికారులు జేడీ, డీఎం, ఏడీ, ఎంఏఓ మండలంలోని అన్ని ఆర్‌బీకేల వ్యవసాయాధికారులతో కలిసి ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటరీ రైతు ప్రధాన కార్యదర్శి జలదంకి శ్రీహరి నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు అల్లం హనుమంతరావు, మండల టీడీపీ యూనిట్ ఇన్‌ఛార్జ్ తాళ్లూరు సుధాకర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ మారుబోయిన గోపాల్, మండల టీడీపీ నాయకుడు గన్నంరెడ్డి, హరి కిషోర్‌రెడ్డి, మండల యూనిట్ ఇన్‌చార్జ్ పొంకం ప్రతాప్, దుండిగం యూనిట్ ఇన్‌ఛార్జ్ కమ్మ శ్రీనివాసులు, దగదర్తి మండల కేంద్రం నుండి టీడీపీ నాయకులు కడియాల సురేష్, వింజం కొండపనాయుడు, వింజం వెంకపనాయుడు, యువ నాయకులు వద్దే వినయ్, వద్దే పవన్, అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, నీటి సంఘం అధ్యక్షులు, కార్యకర్తలు, రైతు సోదరులు పాల్గొన్నారు.

## ఆగని దళితుల పై దాడులు



**తోటపల్లిగూడూరు, మే 3, ప్రభాతవార్త :** సమస్య ఎవరిదైనా టార్గెట్ దళితులే.. బ్రతకాలంటేనే భయమేస్తుందంటున్న దళితులు. తోటపల్లిగూడూరు మండలంలోని కోవెరపాలెం గ్రామంలో అదే జరిగింది. వివరాల్లోకి వెళ్తే తోటపల్లిగూడూరు మండలంలోని చెన్నపల్లిపాలెం హరిజనవాడకు చెందిన ఉదయ్ కుమార్ నెల్లూరు రూరల్ మండలం పెద్ద చెరుకూరు హరిజనవాడకు చెందిన నక్క వివేక్ ఇద్దరు తోటపల్లిగూడూరు మండలం కోవెరపాలెం గ్రామంలో సుమారు 6 ఎకరాలు దండు వెంకట సుబ్బయ్య దగ్గర వివేక్ ఉదయ్‌కుమార్ ఇద్దరు పొలం లీజుకు తీసుకున్నారు. అయితే ఆ పొలంలో శనివారం పొలంలో లీస్దారులు ఇద్దరు మోటార్లు బిగించుకుని పొలాలకు నీరువదిలేందుకు సిద్దపడుతుండగా తోటపల్లిగూడూరులోని గుమ్మళ్లపాలెంకు చెందిన కొంతమంది వచ్చి లీజు దారులైన ఉదయ్‌కుమార్ అడ్డుకున్నారని వారు తెలిపారు. అయితే మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారని వారిద్దరూ ప్రశ్నించగా వెంకట సుబ్బయ్య కుమారుడు మాకు డబ్బులు ఇవ్వాలి అవి ఇస్తేనే పొలంలోకి దిగనిస్తామని ఈసుదారులతో గొడవ పడ్డారని వారు తెలిపారు. ఆ డబ్బులతో మాకేం సంబంధం వాళ్ల నాన్న మాకు లీజు అగ్రిమెంట్ రాసి ఇచ్చి ఉన్నారని వచ్చిన వారికి తెలిపామని అయినా వాడు వినకుండా మా అబ్బాయి దాడి చేశారని వారు చెప్పారు. అంతటితో ఆగకుండా మేము బిగించుకున్న మోటార్లను వైర్లను పైపులను ట్రాక్టర్ తెచ్చి అందులో వేసుకుని వెళ్తున్నారు. అది గమనించిన ఉదయ్ కుమార్ ట్రాక్టర్‌ను అడ్డుకోపోగా తనపై కర్కస్యంగా కల్లుగీసే కత్తితో వచ్చిన వారు దాడి చేశారని లీజు దారులు తెలిపారు. లీజు దారులతో ఒకరైన తెలిమేటి ఉదయ్ కుమార్‌కు తలపై తవ్ర గాయం అయింది. అయినా ఆగకుండా ఉదయ్ కుమార్ ను క్రింద పడదోసి చొక్కా చింపి వేసి తీవ్రంగా కొట్టారని వారు తెలిపారు. లీజుకు పొలం చేసేందుకు వచ్చిన వారు మాపై దాడి చేయడం ఏంటని మేము ప్రశ్నించగా ఎక్కడి నుంచో వచ్చి మా పొలాలు ఏందిరా మీరు చేసేది అంటూ కులం పేరు పెట్టి దూషిస్తూ మేము బిగించుకున్న మోటార్లను కూడా ట్రాక్టర్లో వేసుకుని వెళ్లారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేము లీజు అగ్రిమెంటు ఐదు సంవత్సరాలకు నాలుగు లక్షల రూపాయలకు డబ్బులు కట్టి లీజు అగ్రిమెంట్ చేసుకున్నామని మమ్ములను మా పొలాలు చేసుకోనివ్వకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయ్‌కుమార్‌కు తగిలిన గాయాలు తీవ్రంగా ఉండడంతో ఆయనను నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఆయనకు ప్రథమ చికిత్స అనంతరం సిటీ స్కార్ తదితర టెస్టులు అన్ని చేసి ప్రస్తుతం ఆరోగ్యం మెరుగుబడేందుకు కొంత సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ఏదీ ఏమైనా దళితులపై జరుగుతున్న ఈ దాడులపై ప్రజా సంఘాలు దళిత ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలు సాగు చేసుకునేందుకు వచ్చిన వారిపై ఏమిటి దౌర్జన్యకాండ ఎందుకు ఈ వివక్షత అని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా దళితులపై జరుగుతున్న దాడులను ఆపకపోతే దళితులు దళిత ఉమ్యమకారులు ప్రజా సంఘాలు దళిత నాయకులు రోడ్లపైకి వచ్చే రోజు దగ్గర్లోనే ఉందని అధికారులను ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. మరి పోలీసులు ఎవరికి ఎలా న్యాయం చేస్తారో వేచి చూడాలి.

## 3 ఎఫ్ ఇండస్ట్రీస్‌చే టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



**ముత్తుకూరు, మే 3, ప్రభాతవార్త :** మండలంలోని పిహెచ్‌సి నందు టీబీ వ్యాధి గ్రస్తుల కొరకు 3 ఎఫ్ ఇండస్ట్రీస్‌చే పౌష్టికాహారం పంపిణీ చేసారు. శనివారం ముత్తుకూరు పిహెచ్ నందు టీబీ వ్యాధి కోసం ట్రీట్మెంట్ తీసుకుంటున్న 20 మంది పేషెంట్స్‌కు ప్రతి నెలా ఆరు నెలల పాటు బాదాం, జీడిపప్పు, కర్జూరం 150 గ్రాములు, పెసలు 1 కేజీ, శెనగలు 1 కేజీ, గోధుమ పిండి 1 కేజీ, బెల్లం ఆర కేజీ, రాగి పిండి 1 కేజీ, 30 గుడ్లు అందజేసారు. ప్రతి నెల టిబి వ్యాధి గ్రాస్తులకు పౌష్టికాహారం అందించడం పట్ల 3 ఎఫ్ ఇండస్ట్రీస్ డిజిఎం శేఖర్ రెడ్డి, సిఎస్ఆర్ ప్రతినిధి సునీల్ బాబులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఎం అండ్ హెచ్ఓ ఖాదర్ భాషా, మెడికల్ ఆఫీసర్, దేవికృప, టిబి కోఆర్డినేటర్ విజయ్, రాజు, జావీద్ పాల్గొన్నారు.

## పెంచలకోన అభయారణ్యంలో ఇరిగేషన్ కెనాల్ పనులకు అనుమతులు మంజూరు చేయాలి



**నెల్లూరు కలెక్టరేట్, మే 3, ప్రభాతవార్త :** అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ కార్యాలయంలో బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ రిప్రజెంటేషన్ ఇచ్చారు. శనివారం సెలవు కావడంతో మంగళగిరిలోని అరణ్య భవన్లో సెక్షన్ ఆఫీసర్‌కు ఆధారాలతో కూడిన వినతి పత్రం అందించారు. వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా ప్రభుత్వం గుర్తించక ముందే కెనాల్ పనులు 70 శాతం పూర్తయ్యాయి. సోమశిల రాపూర్ కెనాల్ పనులు జీవో నెంబర్ 99- 5-2006 ఇరిగేషన్ క్యాడ్ 399 కోట్లు వ్యయంతో కెనాల్ పనులు జరిగాయి. అటవీ శాఖ అనుమతులు లేక 220 కోట్లు పనులు నిర్వీర్యంగా మారాయి. 7 కిలో మీటర్లలో అభయారణ్యం ఉందని అటవీ శాఖ పనులు ఆపివేసింది. దేశ అభివృద్ధిలో భాగంగా జాతీయ జలాశయాల కొరకు వందల అనుమతులు ఇచ్చారు. పదివేల మందికి నీటి కోసం ఆ విధంగానే అనుమతులు మంజూరు చేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు తెలంగాణలో నేషనల్ హైవే కొరకు 11 కిలోమీటర్లు ఓవర్ పాస్ వంతెనలు, వన్యప్రాణులు కెనాల్స్‌లో పడకుండా లియో పార్ట్ ప్రూఫ్ ఫెన్సింగ్, నిర్మించి రహదారులకు అటవీ అనుమతులు ఇచ్చారు. తమిళనాడు కేరళ సరిహద్దులలో వన్యప్రాణుల కోసం కనోపి వంతెనలు, చిన్నార్ వైల్డ్ లైఫ్ సాంక్చరీ జాతీయ రహదారి కోసం 15 కిలోమీటర్ల 19 కనోపి వంతెనలు నిర్మించారు. ఉడుతలు కోతులు కోసం 9 నట్టినారో వంతెనలు నిర్మించారు. అస్సాంలో 125 గిబ్బన్ జాతి కోతులు కొరకు పందిరి వంతెన నిర్మించారు. నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు జలాశయాలు నీటిమట్టం కంటే ఎత్తైన రాపూర్ 9గ్రామాలులో పదివేల మందికి నీటి వసతి అభివృద్ధికి దూరంగా ఉన్నారు. అడవిలో ప్రాణులకు పర్యావరణ రక్షణ కల్పించే మనుషుల కే పర్యావరణ అనుమతులు ఆటంకంగా మారాయి.

## వైసిపి నాయకుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**ఆత్మకూరు, మే 3, ప్రభాతవార్త :** ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన వైఎస్‌ఆర్‌సిపి నాయకుల కుటుంబ సభ్యులను శనివారం ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఆత్మకూరు పట్టణంలో సోమవరపు భాస్కర్‌రెడ్డి చిన్నాన్న సోమవరపు సుబ్బారెడ్డి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మండలంలోని పాతజంగాలపల్లి గ్రామంలోని వైసిపి నాయకులు గడ్డం శ్రీనివాసులురెడ్డి సోదరుడు విజయభాస్కర్‌రెడ్డి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తామంతా అండగా ఉంటామన్నారు. ఈకార్యక్రమంలో వైసిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొట్టేళ్లు మందపై కుక్కల దాడి

**– 14 పొట్టేళ్లు మృతి**



**కోవూరు, మే 3, ప్రభాతవార్త :** కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం వేకువ జాము న గ్రామంలో ఉన్న పొట్టేళ్ల మందపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన 14 పొట్టేళ్లు మృతిచెందడం జరిగింది. ఈ గ్రామానికి చెందిన పామర్తి శ్రీనివాసులు తన ఇంటి ముందు పొట్టేళ్లను కట్టి వేసి ఉండగా తెల్లవారుజామున కుక్కలు దాడి చేసి ఈ పని చేశాయని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వీటి మృతి కారణంగా తనకు 70 వేలు నష్టం అయినట్లు ఈ సందర్భంగా బాధితుడు వాపోయాడు.

## వక్ఫ్ సవరణ చట్టం రద్దుకోరుతూ ఆత్మకూరులో ర్యాలీ



**ఆత్మకూరు, మే 3, ప్రభాతవార్త :** ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన వక్ఫ్‌సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆత్మకూరు పట్టణంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణ పరిధిలో ఏర్పడిన జెఎసి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీకి మద్ధతుగా పట్టణంలోని ముస్లిం సోదరులు , లౌకికవాదులు , వైసిపి , సిపిఎం పార్టీ నాయకులు, సిఐటియు ఇతర సంస్థలు మద్ధతుగా పాల్గొన్నారు. సత్రం సెంటర్ నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో జెఎసి కమిటీ సభ్యులు పి.యస్దానిబాష్యా, మున్నా, పి.మస్తాన్, షేక్ ఖలీల్, సల్మాన్‌ఖాన్, ఎస్.డి.జమీర్, షేక్ సందాని, శేషారెడ్డి, లక్ష్మీపతి, నాగయ్య, డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, చర్చి పాస్టర్లు ,అధ్యక్షులు ప్రసాద్, అన్ని మజీద్‌ల మతపెద్దలు పాల్గొన్నారు.

## నూరుశాతం అక్షరాస్యత సాధించాలి



**కోవూరు, మే 3, ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పొదుపు గ్రూపు మహిళలంతా పూర్తిస్థాయిలో అక్షరాస్యులు అయ్యేలా ఏపీఎం సీసీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన వారితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలందరినీ లక్షాధికారులుగా తయారు చేసేలా దృష్టి పెట్టడమే కాకుండా బ్యాంకుల ద్వారా వారు తీసుకున్న రుణాలను సద్వినియోగం అయ్యేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. కోవూరు మండలం నూరుశాతం అక్షరాస్యతకు జిల్లాకు ఆదర్శం కావాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుబ్బరాజు, సీసీలు చైతన్య, రాము ఉన్నారు.

## చెత్త తరలింపులో అలసత్వం వద్దు



**కోవూరు, మే 3, ప్రభాతవార్త :** గ్రామాల్లోని గ్రీన్ అంబాసిడర్లు చెత్త తరలింపులో అలసత్వం లేకుండా తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తెలిపారు. కోవూరు మండలం మోడేగుంట గ్రామం పంచాయతీలో శనివారం ఐవీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి చెత్తను తరలించే కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు కూడా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు తమవంతుగా సహకరించాలన్నారు. ఈ చెత్త ద్వారా సంపద కేంద్రాల్లో రైతులకు ఉపయోగపడే ఎరువులను తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమలత, తదితరులు ఉన్నారు.

## భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ



**ఇనమడుగు (కోవూరు), మే 3, ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న భగవాన్ సత్యానంద మహర్షుల వారి ఆశ్రమంలో సాధు సత్పురుష సమాగం కార్యక్రమంలో భాగంగా శనివారం గత మూడు రోజులుగా జరుగుతున్న సాధు సత్పురుష సమాగంలో పాల్గొన్న భక్తులకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సాధువులకు మఠాధిపతులకు, పీఠాధిపతులకు భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇనమడుగు గ్రామానికి చెందిన సత్యానంద గణేష్ విద్యార్థి బృందం బొమ్మిశెట్టి శివరామప్రసాద్ కుటుంబ సభ్యులు, తిరుమూరు విజయకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు, కైలాసం చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు , శ్రీనివాస్ దంపతులు, పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి తమవంతుగా సహకరించారు. ఈ కార్యక్రమంలో ఇనమడుగు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు సునీల్‌కుమార్‌రెడ్డి, ఆత్మ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, రైతు నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొని ప్రతి ఒక్కరికీ అన్నప్రసాదం అందేలా ఇనమడుగు గ్రామానికి సంబంధించిన అనేకమంది చర్యలు చేపట్టారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, మే 3, ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో చైత్రమాస శనివారం పర్వదినం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమం కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి , భక్తులు ఉన్నారు.

## ప్రభుత్వ వైద్యకళాశాలల సమస్యలను పరిష్కరించాలి

**– ఏబీఆర్ఎస్ఎం ఆరోగ్య మంత్రికి వినతిపత్రం**



**వింజమూరు, మే 3, ప్రభాతవార్త :** అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా సంఘం(ఏబీఆర్ఎస్ఎం) ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి సత్య కుమార్‌కు ప్రభుత్వ వైద్య కళాశాలలు, రిఫెరల్ ఆసుపత్రుల సమస్యలను పరిష్కరించాలని అభ్యర్థించింది. రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య విద్య ఫ్యాకల్టీ పోస్టులన్నింటిని భర్తీ చేయాలని, అదేవిధంగా ప్రభుత్వ వైద్యకళాశాలకు సంబంధించిన ఆసుపత్రులలో వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలల సౌకర్యాలను మెరుగుపరచాలని, ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రులలో పోస్టు గ్రాడ్యుయేట్ పోస్టుల సంఖ్యను పెంచాలని, ప్రభుత్వ వైద్య కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకుల ప్రమోషన్లలో చాలా ఆలస్యం జరిగిందని, ప్రమోషన్ల కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఏబీఆర్ఎస్ఎం అభ్యర్థించింది. పైన పేర్కొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి సత్యకుమార్ ఏబీఆర్ఎస్ఎంకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంగయ్య, ఏపీయూఎస్ ప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, తిరుపాల్, మధు, కృష్ణారెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాలలో ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలి



**కావలిరూరల్, మే03 ప్రభాతవార్త :** గ్రామాలలోని గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి చెత్తసేకరించాలని కావలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి చేవూరు శ్రీదేవి తెలియచేశారు. కావలిరూరల్ మండలం సిరిపురం, చలంచర్ల గ్రామపంచాయితీలలో ఎంపిడీఓ శ్రీదేవి శనివారం పర్యటించి చెత్తసంపద తయారీకేంద్రాలను పరిశీలించి తడి, పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్వచ్ఛగ్రామాలే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తుందని తెలియచేశారు. అందులో భాగంగా తడి, పొడిచెత్త ఇంటివద్ద నుంచి వేరువేరుగా సేకరించాలని ఈ చెత్తనుండే సంపదను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని తెలియచేశారు. కావలి మండలంలో చెత్తసేకరణలో ముందుగా అయిదు పంచాయితీలను ఎంపిక చేసినట్లు తెలియచేశారు. ఈ గ్రామాలలో ముందుగా కసరత్తు చేస్తున్నట్లు తెలియచేశారు. గ్రామంలోని ప్రజలకు ఐడిఆర్ఎస్ నుంచి ఫోన్‌కాల్స్ వస్తాయని చెత్తసేకరిస్తే ఒకటి నొక్కాలని, చెత్తను తీసుకువెళ్లకుంటే రెండు నొక్కాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి షేక్.అబ్దుల్‌సమద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత నిర్బంధ ప్రవేశాల షెడ్యూల్ ప్రారంభం

**పొదలకూరు, మే 3, ప్రభాతవార్త :** విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 2025 – 26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ తేది మే 2 నుండి మే 19 వరకు ఉన్నట్లు మండల విద్యాశాఖ అధికారులు కె. రేణుక, ఎం. శోభనాద్రిలు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ప్రకారం మే 20 నుండి మే 24 వరకు విద్యార్థుల ప్రవేశానికి అర్హతలు నిర్ణయిస్తారు. లాటరీ విధానంలో మొదటి విడత ఫలితాలను మే 29న విడుదల చేసి సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 8న ఖరారు చేస్తారు. రెండో విడత ఫలితాలను జూన్ 11న విడుదల చేసి, సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 18న ఖరారు చేస్తారు. దరఖాస్తు విధానం ఇలా.. అర్హులైన విద్యార్థులు ప్రాథమిక వివరాలతో వెబ్ సైట్‌లో మాత్రమే అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత చిరునామా కోసం దరఖాస్తుదారుల తల్లిదండ్రుల ఆధార్, ఓటరు కార్డు, రేషను కార్డు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు, పాస్పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్తు బిల్లు, అద్దె ఒప్పంద పత్రాల్లో ఏదో ఒక గుర్తింపు కార్డు, పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలి. గ్రామీణ ప్రాంత కుటుంబాల వార్షిక ఆదాయం రూ. 1,20,000 పట్టణ, ప్రాంత వాసులకు వార్షిక ఆదాయం రూ. 1,40,000 లోపు ఉండవలెను. ఈ ఏడాది పాఠశాలల్లో ప్రవేశాలకు మే 31 నాటికి ఐదేళ్లు నిండిన పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18004258599 సంప్రదించవచ్చు. అందువల్ల మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు.

## బాపూజీనగర్‌లో చుక్కల దుప్పిపై కుక్కల దాడులు



**కావలి, మే03 ప్రభాతవార్త :** కావలి పట్టణ బాపూజినగర్ సమీపంలో అటవీప్రాంతంనుంచి వచ్చిన చుక్కల దుప్పిని కుక్కలు చుట్టుముట్టి దాడిచేయడంతో శనివారం తీవ్రగాయాలపాలైంది. స్థానికులు ఫారెస్ట్ కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదుచేయడంతో గాయాలపాలైన దుప్పిని పశువుల వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చుక్కలదుప్పి మృతిచెందింది. కావలి పట్టణంలోని ఫారెస్ట్‌శాఖ పరిధిలోని నగరవనంలో దుప్పిని కాల్చివేశారు.

## బుచ్చిరెడ్డిపాలెం 6వ నగర పంచాయితీ పరిధిలోని 6వ వార్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



**బుచ్చి మే 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ పరిధిలోని 6 వ వార్డులో గత పది సంవత్సరాలుగా విద్యుత్ స్తంభాలు లేక చీకటిలో ఉన్న వీధిలో గతనెలలో గడగడపకు ప్రశాంతమ్మ కార్యక్రమంలో భాగంగా అరవ వార్డు బ్రాహ్మణ వీధి పృటించినప్పుడు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి,చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్,కౌన్సిలర్ రహమత్ దృష్టికి తీసుకొని రావడం జరిగింది. ఎమ్మెల్యే వెంటనే ఆవీధులకు లైట్లు వేయమని ఆదేశించడంతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని. మైనార్టీనాయకులు పఠాన్ మహబూభాషా అందుకు ప్రత్యేకంగా దన్యవాదాలు తెలిపారు.

## వేసవి శిక్షణా శిబిరం




**నెల్లూరు, మే 3, ప్రభాతవార్త – వైద్యం :** పిల్లల మానసిక వికాసానికి, వారి శారీరక ధారుడ్యానికి సామాజిక అవగాహనకు సోదరతత్వ భావాలను పెంపొందించే ఆటలు, పాటలు, కథలు, చిత్రలేఖనం, సైన్స్, శాస్త్రీయ, భావాలతో వేసవి శిక్షణా శిబిరాన్ని మే 1వ తేదీ ప్రపంచ కార్మిక దీక్ష దినాన్ని పురస్కరించుకుని జనశక్తి నగర్ వేదాయపాలెంలో ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి రిటైర్డ్ హెడ్ మాస్టర్ సుబ్బారెడ్డి జాతీయ జెండా ఆవిష్కరిస్తూ బాల బాలికలు, నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగడానికి శిబిరాన్ని పిల్లలు ఉపయోగించుకోవాలని వివరించారు. ముఖ్య వక్తగా చింతల జాషువా ప్రసంగిస్తూ శిబిరాన్ని, పిల్లలను వారి భవిష్యత్తుకు ఈ శిబిరం యొక్క ఉపయోగాన్ని వివరించారు. ఈ సభలో టీచర్స్ నారాయణమ్మ, రాజేశ్వరి, స్థానికులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు జననేత నూనె చిరు సత్కారం

**– మంత్రి సేవలు భేష్ అన్న మల్లిఖార్జున యాదవ్**



**నెల్లూరు, మే 3, ప్రభాతవార్త-వైద్యం :** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సేవలు అభినందనీయమని జనసేన పార్టీ సీనియర్ నేత నూనె మల్లిఖార్జునయాదవ్ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ శాలువాతో సత్కరించారు. అనంతరం మల్లిఖార్జునయాదవ్ విలేకర్లతో మాట్లాడారు. చిన్న తనం నుండి కష్టపడి చదువుకుని, భారతీయ జనతా పార్టీలో కార్యకర్త నుండి దేశ స్థాయి నాయకుడిగా ఎదగడం అందరికి సాధ్యం కానీ పని అన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా సత్యకుమార్ భారతీయ జనతా పార్టీ పెద్దల మన్ననలు పొందారని, అందుకే ఆయన రాష్ట్ర మంత్రి అయ్యారని పేర్కొన్నారు. భవిష్యత్తులో సత్యకుమార్ యాదవ్ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వర్షాచలం రాజేష్, పెయ్యల పవన్ యాదవ్, వెంకట్ యాదవ్, తాల్లూరి, మల్లి, జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## జూపల్లికి ఎమ్మెల్యే అభినందనలు



**వింజమూరు, మే 3, ప్రభాతవార్త :** వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి మంజూరు చేసిన దయాలసిస్ కేంద్ర ప్రారంభోత్సవానికి వస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు చేసిన ఏర్పాట్ల పట్ల ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, చేబ్రోలు వసంతరావుల ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాట్లను ఘనంగా చేశారు. మంత్రి ఎమ్మెల్యే వైద్యశాల సమీపంలోకి రాగానే డీజే, కోలాటంను ప్రదర్శించి స్వాగతం పలకడం సంతోషాన్నిచ్చిందని తెలిపారు. చిన్నారులు ప్రదర్శించిన కోలాటం మనసుకు హత్తుకుందన్నారు. సభా వేదిక వద్దకు వచ్చిన ప్రజానీకానికి ఎలాంటి లోపం లేకుండా ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించడం శుభ పరిణామం అని హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజలు సమస్యల పట్ల తెలియపరచాలి

- తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, మే 3, ప్రభాతవార్త** రేపు జరగబోయే ప్రజా సమస్య కార్యక్రమానికి ప్రజలు హాజరై సమస్యలను తెలియపరచాలని కె.స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. మండలంలో ప్రతి సమస్య పట్ల ప్రజలు తప్పనిసరిగా హాజరు కావాలని తదుపరి పరిష్కారం చేస్తామని ఆమె తెలియజేశారు.

## శ్రీపెనుశిల లక్ష్మీనర్శింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ మెంబర్‌గా కిన్నెర



**ఆత్మకూరు, మే 3, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణానికి చెందిన కిన్నెర నర్శింహారావ్ శ్రీపెనుశిల లక్ష్మీనర్శింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ మెంబర్‌గా శనివారం నియమితులయ్యారు. ఆయన గతంలో మండల నాయీబ్రాహ్మణ సహకార సంఘం అధ్యక్షుడిగా, ఎల్ఆర్‌పల్లి పాఠశాల విద్యాకమిటీ మెంబర్‌గా, వహరించారు. ఈ పదవికి ఎంపిక చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి , పదవి లభించేందుకు సహకరించిన పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డికి, జిల్లా తెలుగుయువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడుకు ప్రనత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎపి టిడ్కో చైర్మెన్ వేములపాటిని కలిసిన పవన్‌కుమార్



**ఆత్మకూరు, మే 3, ప్రభాతవార్త :** జనసేనపార్టీ ఎపి టిడ్కో చైర్మెన్ వేములపాటి అజయ్‌ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం జిల్లా జనసేనపార్టీ జాయింట్ సెక్రటరీ వనం పవన్‌కుమార్ , ఆత్మకూరు నియోజకవర్గ ఐటి కోఆర్డినేటర్ పులిపాటి అనిల్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు పసుపులేటి శ్రీరామ్, ఏఎస్‌పేట మండల అధ్యక్షులు ఎస్.డి.అక్బర్‌బాషా, ఆత్మకూరు టౌన్ సీనియర్ నాయకులు గద్దం వంశీకృష్ణ, మర్రిపాడు మండల జనసేన నాయకులు చిన్న తదితరులు పాల్గొన్నారు.

## జలదంకిలో మంత్రి సత్యకుమార్‌కు ఘన సత్కారం



**జలదంకి, మే 3, ప్రభాతవార్త :** రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యదవ్ కు శనివారం మండలకేంద్రమైన జలదంకిలో ఘన సత్కారం జరిగింది. వింజమూరులో దయాలసిస్ కేంద్ర ప్రారంభోత్స వానికివెళుతున్న సందర్బంగ జలదంకిలో కొద్దిసేపు ఆగారు. ఈసందర్బంగ యువమోర్చానాయకులతో రాష్ట్ర బిజెపి యువమోర్చా ఉపాధ్యక్షుడు వద్దే శ్రీనాద్‌రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి ఆద్యర్యంలో ఆపార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.బాణా సంచాపేలుళ్ళు నాయకుల నినాదాలమధ్య మంత్రికి పుష్పగుచ్చాలు అందించి గజమాల వేశారు. పలువురు నాయకుల్లిన శ్రీనాద్‌రెడ్డి మంత్రికి పరిచయం చేయారు.అనంతరం ప్రజలనుంచి వచ్చిన అర్జీలను మంత్రి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట కిసాన్‌మోర్చ నాయకుడు చల్లా హనుమారెడ్డి,ఎంపిటిసి కుట్టుబోయిన మాధవరావు యాదవ్,వంగవరపు మధుసూదన్‌రెడ్డి,బలబద్ర ప్రభాకర్,మండల ప్రధానకార్యదర్శి వంటేరు రాకేష్,ఉపాధ్యక్షుడు కమతం బాలకోటయ్య యాదవ్,కార్యదర్శి బలబద్ర మల్లికార్జున,యువమోర్చా మండల అద్యక్షుడు ఆతిన చైతన్య యాదవ్,ప్రధానకార్యదర్శి కుట్టుబోయిన ప్రవీణ్ కుమార్ యాదవ్,కామేపల్లి మణికంఠ,ఎస్‌సి సెల్ అద్యక్షుడు నేలపాటి ముసలయ్య,మైనారిటి సెల్ అద్యక్షుడు షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## పెన్నానదిలో ఊబిలో కూరుకుని వ్యక్తి మృతి



**కోవూరు, మే 3, ప్రభాతవార్త :** బర్రెలు కాచుకుంటూ జీవనం సాగించే ఓ కుటుంబంలో శనివారం విషాద సంఘటన చోటు చేసుకుంది. ప్రతి రోజూ బర్రెలు తోలుకునే ఓ వ్యక్తి మధ్యాహ్నంకు శవమై రావడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం చోటు చేసుకుంది. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ జమ్మిపాలెం గ్రామానికి చెందిన బద్దిపూడి చలపతి(35) యథావిధిగా శనివారం బర్రెలు తోలుకుని పెన్నానది పరివాహక ప్రాంతానికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో మొహం కడుక్కునేందుకు పెన్నానదిలో దిగగా కాలుజారి ఊబిలో పడిపోయాడు. ఈ మేరకు ఈతగాళ్లు వచ్చి చలపతి మృతదేహాన్ని పైకి తీసుకుని వచ్చారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న కొడుకు ఆకస్మిక మరణాన్ని ఆ తల్లిదండ్రులు తట్టుకోలేకపోయారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ రషీద్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**నెల్లూరు, మే 3, ప్రభాత వార్త-వైద్యం** అల్లీపురం సోమి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిశీలించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు తదితరులు. అల్లీపురం పీహెచ్‌సీ మౌలిక సదుపాయాలు, ప్రహరిగోడ నిర్మాణానికి 1 కోటి 30 లక్షలు అవసరమవుతాయని అంచనా వేయగా 30 లక్షలు బీద మస్తాన్‌రావు ఎంపీ ఫండ్స్ నుండి ఇస్తామని హామీ ఇచ్చారు.

## జిల్లా స్థాయి సభ్యులుగా శేషం.సుదర్శన్

- జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న శేషం సుదర్శన్



**నెల్లూరు కలెక్టరేట్ 3, ప్రభాతవార్త** జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ (వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం) కమిటీ సభ్యులుగా మర్రిపాడు మండలం, రాంపల్లి గ్రామానికి చెందిన శేషం సుదర్శన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భ ంగా శనివారం కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఐ ఏ ఎస్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ మేరకు శేషం సుదర్శన్ గతంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులుగా అనేక అట్రాసిటీ కేసులపై జిల్లా అధికారులను సమన్వయం చేసుకొని సేవలు అందించిన ఆయన మరోసారి జిల్లా విజిలెన్స్ కమిటీలో అవకాశం లభించడం విశేషం. శేషం సుదర్శన్ మాట్లాడుతూ కార్మికుల హక్కు లు, బడిబాట పట్టే చిన్న పిల్లలచే వెట్టి చాకిరి చేయించే పారిశ్రా మిక రంగాలు వివిధ సంస్థల్లో పనిచేస్తున్న వారిని గుర్తించి ఆ యొక్క సమస్యలను జిల్లా ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కమిటీలో నాకు చోటు కల్పించిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఐఏఎస్‌కి, జాయింట్ కలెక్టర్ కార్తీక్ మరియు జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఐపీఎస్‌కి అదేవిధంగా సోషల్ వెల్ఫేర్ డిడికి ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆకట్టుకున్న అన్నమాచార్య కీర్తనలు



**కోవూరు, మే 3, ప్రభాతవార్త :** మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న భగవాన్ సత్యానంద మహర్షుల వారి ఆశ్ర మంలో సాధు సత్పురుష సమాగం కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం బృందంచే ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు ప్రతి ఒక్క రినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రధానంగా వారు అన్నమాచార్య రచించిన కీర్త నలు పాడుతూ సభను పూర్తిగా అలరింపజేశారు. ఈ అన్నమాచార్య ప్రాజెక్టుకు సంబంధించిన తేజోవతి, లోకేష్, గోపిల బృందం ఈ సంగీత విభావరిలో అన్నమాచార్య కీర్తనలు ఆలపించి భక్తుల హృదయాలను అలరింపజేశారు.

## పుస్తక పఠనం విద్యార్థులకు ఉపయోగకరం



**కోవూరు, మే 3, ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల శంకర్‌రెడ్డి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సా హంగా కొనసా గుతున్నాయి. ఈ మేర కు శనివారం జనవి జ్ఞాన వేదిక ఆధ్వ ర్యంలో ఉపాధ్యాయులు ఏ. విజయకుమార్, రిటైర్డ్ తహసీల్దార్ బి. సురేంద్రలు పాల్గొని విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ వేసవిలో విద్యార్థులు ఎండలో అటూ ఇటు తిరగకుండా గ్రంథాలయానికి వచ్చి గ్రంథ పఠన చేసి తమ మేదస్సును మరింత పదును పెట్టుకోవాలన్నారు. గ్రంథాలయంలో అనేకమంది మహనీయుల గ్రంథాలు, చరిత్రకారుల పుస్తకాలు ఉన్నాయని, వాటిని పూర్తిగా వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత పార్వతీశం, ఎస్. సుబ్రహ్మణ్యం, భాస్కర్‌రావు, అశోక్‌లు పలు విషయాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

## సామాన్యుడిలా టీషాప్‌వద్ద టీతాగుతున్న ఆరోగ్యమంత్రి

## సత్యకుమార్ కావలిలో అందరి కళ్లు మంత్రి పైనే



**కావలి, మే03 ప్రభాతవార్త :** ఒక అత్యంత సామా న్యుడిలా కావలిలోని ఓ టీషాం వద్ద టీ తాగుతూ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకు మార్ యాదవ్ అందరి కంటా పడ్డారు. ఒక్క సారిగా కావలి ట్రంకు రోడ్డులోని జనం కళ్లన్నీ ఆ మంత్రిపైనే పడ్డాయి. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కావలి రైల్వేరోడ్డులోని పోలీసు అతిథిగృహంలో బసచేశారు. శనివారం ఉదయం కావలి బిజెపినేతలతో పురవీధుల్లో నడుస్తూ టీషాప్‌వద్దకు వెళ్లి సాధారణ వ్యక్తిలా, హంగూ ఆర్భాటాలు, పోలీసు ఎస్కార్ట్ లేకుండా కూర్చొన్న వైనం కావలిలో హాట్‌టాపిక్‌గా మారింది. బిజెపి నేతలు కందుకూరి వెంకట సత్య నారాయణ, గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, కుట్టుబోయిన బ్రహ్మా నందం యాదవ్, తదితర బిజెపి నేతలతో సరదాగా నడిచివెళ్లి టీతాగడం కావలి కంటప డింది. ఏనోట విన్నా కావలిలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సింప్లిసిటిపై చర్చసాగింది. పోలీసు అతిథిగృహంలో బిజెపి నేతలు మంత్రిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి పూలబొకెలు అందచేశారు.

## తేనేటి విందులో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే



**వింజమూరు, మే 3, ప్రభాతవార్త :** వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మంజూరు చేసిన దయాలసిస్ సెంటర్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శనివారం ప్రారంభించారు. తదుపరి వైద్యశాల నందు ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో పాల్గొని ఈ ప్రాంత వాసులు కష్ట సుఖాలు తనకు తెలుసునని ఆయన అన్నారు. కావున ఈ ప్రాంత పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ దయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేశానన్నారు. అనంతరం భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పులిచర్ల వెంకట నారాయణరెడ్డి ఏర్పాటు చేసిన తేనేటి విందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి హాజరయ్యారు. సందర్భంగా పులిచర్ల వెంకట్ నారాయణరెడ్డి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేయగలరని విజ్ఞప్తి చేశారు. దయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేసి ఈ ప్రాంత ప్రజలు మీకు ఎల్లకాలం రుణపడి ఉండేలా చేశారన్నారు. తదుపరి అపస్ ఉపాధ్యాయ సంఘం తరుపున, పలువురు ఆయనకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ తేనేటి విందుపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.

## రైతన్నలను ఆదుకున్న ఎమ్మెల్యే



**విడవలూరు, మే 3, ప్రభాతవార్త :** మండల కేంద్రం జాన్ పేట రైతన్నలను ఆదుకు న్న తిరు మల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చొరవతో సాయి పంట కాలవను విపిఆర్ కన్స్ట్రక్షన్ సౌజన్యంతో శనివారం పూడికతీత కార్యక్రమం మండల ఇంచార్జ్ అడపల శ్రీధర్ రెడ్డి, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి సత్య వోలు సత్యం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ పంట కాలవ సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే ఆమె వెంటనే స్పందించి పేదలను ఆదుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని కొనియాడారు. ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు పాశం శ్రీహరి రెడ్డి, పొన్నలూరు పురంధర్ రెడ్డి, దగ్గోలు కార్తీక్, అనపల్లి ధనుంజయ, మహిళలు పాల్గొన్నారు.

## డాక్టర్ కొండా ప్రత్యూషకు అభినందనలు



**వింజమూరు, మే 3, ప్రభాతవార్త** వింజమూరులోని ఆర్యవైశ్య ప్రముఖులైన కొండ రమణాజీ కుమారుడు ప్రముఖ పురిటి బిడ్డల వైద్య నిపుణులు కొండా కళ్యాణ్ సతీమణి కొండా ప్రత్యూష ఎండ్రో క్రినాలజీ విభాగం నందు ఎండీ కోర్సును పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు. వింజమూరు పట్టణంలో అనేక ఉచిత మెడిక్ క్యాంపులను నిర్వహించి ఈ ప్రాంతంలోనే పేద, మధ్య తరగతి వారికి వైద్య సేవలు అందించడంలో కుటుంబం ఎంతగానో పేరుపొందిందని అలాంటి కుటుంబంలో కొండా రమణాజీ కుటుంబ సభ్యులు కొండా కళ్యాణ్ ప్రత్యూషలు వైద్య రంగంలో ఉన్నత స్థాయికి ఎదగడంతో కొండా వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్, కొండా శ్రీనివాసులు శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభించిన

- కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

**నెల్లూరు రూరల్, మే 3, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఏసి సుబ్బిరెడ్డి స్టేడియంలో అండర్ 14, సౌత్ జోన్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆరంభం అయ్యాయి. ఈ ప్రారంభోత్సవానికి ఆయనతో పాటు డాక్టర్ పిట్టి మల్లికార్జునరావు డిఎస్ డిఓ ఆర్కో యతిరాజ్ పాల్గొన్నారు. క్రీడా పోటీలో ప్రారంభోత్సవంలో మన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రౌండ్‌లో రిబ్బన్ కట్ చేసి ఆటల పోటీలను కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. గ్రౌండ్లో ఆయన బ్యాటింగ్ చేసి క్రీడాకారులను అలరించారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులందరూ ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. 8 రాష్ట్రాల నుండి బాల, బాలికలు, 250 విచ్చేసారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో విచ్చేసిన క్రీడాకారులకు వారికి కోచ్. క్రీడా సంఘ నాయకులకు ఎలాంటి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసామని తెలిపారు.

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన ఎమ్మార్పిఎస్, ఎంఎస్ఎఫ్ నేతలు



**వింజమూరు, మే 3, ప్రభా తవార్త:** వింజమూరులోని ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన దయాలసిస్ సెంటర్‌ను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శని వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగలు, సభా వేదిక వద్ద మంత్రిని కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువాలతో సత్కరించారు. మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ అమలులో కీలక భూమిక పోషించిన ఈ దేశ ప్రధాని నరేంద్ర మోడీకి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఉదయగిరి నియోజకవర్గంలో పేదలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వింజమూరుకి దయాలసిస్ సెంటర్‌ను తీసుకురావడంలో కాకర్ల సురేష్ అసెంబ్లీలో తన గళాన్ని విప్పిన వెంటనే స్పందించి వింజమూరుకి కోటి 50 లక్ష రూపాయలతో వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి దయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేసిన వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని తీసుకురావడంలో అత్యంత కీలక భూమిక పోసించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాత, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ మండల ఇన్‌ఛార్జీలు గంగపట్ల సింహాద్రి, గోసాల సుధాకర్, గోచిపాతల ఆనంద్‌రావు, నందిపోగు వెంగళరావు, మల్లెల తిరుమలేష్, చెంచల రాకేష్, కర్రా శ్యాముల్, బుదాల లక్ష్మణ్, బర్రె అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద రఫి కుటుంబాన్ని పరామర్శించిన ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి మే 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పోలినాయుడు చెరువులో ఇటీవల హత్యగురైన వైసిపి నాయకులు పెద్ద రఫీ కుటుంబాన్ని వైసిపి రాష్ట్ర అధికారప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి పరామర్శించారు. నా భర్తను దారుణంగా హత్య చేశారని మృతుడు రఫీ భార్య బోరున విలపించింది. రఫీ కుమార్తెల్ని చూసిన ప్రసన్నకుమార్‌రెడ్డి ఒకింత భావో ద్వేగానికి గురైయ్యాడు. రఫీ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించే విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ తరపున న్యాయ పోరాటం చేస్తామని ప్రసన్నకుమార్‌రెడ్డి ఆకుటుంబానికి హామి ఇచ్చారు.ఈ కుటుంబానికి అండంగా ఉంటామని అన్నారు. ఈకార్యక్రమంలో బుచ్చి మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, నగర అధ్యక్షులు షేక్.షాహుల్, వైసిపి సీనియర్ నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, కోవూరు నియోజకర్గం డాక్టర్స్ విభాగం అధ్యక్షులు డాక్టర్ అల్లాబక్ష్, 18 వవార్డు వైసిపి ఇన్‌చార్జి మోర్ల భరత్, బుచ్చినగర వైసిపి మైనార్టీ విభాగం అధ్యక్షులు పఠాన్ రసూల్ పలువురు వైసిపి నాయకులున్నారు.

## గురువులంటే సాక్షాత్తు ఈశ్వర స్వరూపులు




**కోవూరు, మే 3, ప్రభాతవార్త :** గురువులంటే సాక్షాత్తు ఈశ్వర స్వరూపులేనని గురువుల పాదాలననుసరించి నిర్మల హృదయంతో వారికి సేవ చేయాలని భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారత స్వామీజీ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ సత్యానంద ఆశ్రమంలో జరుగుతున్న సాధు సత్పురుష సమాగం కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడుతూ సత్యానంద మహర్షి సార్థక నామధేయుడు అన్నారు. బ్రహ్మానందం పొందాలంటే బోధన స్వరూపం మారాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నదానిలో కొంత మేర భగవన్ నామస్మరణ చేయాలని ఈ సందర్భగంఆ ఆయన భక్తులకు సూచించారు. ఈ క్షణమే మనది.. మరుక్షణం లేదనుకోవాలని తెలియజేశారు. మహాత్ముడు చెప్పే బోధనలను ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ప్రస్తుతం భక్తి అనేది కమిషన్ పద్ధతిలో ఉందని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. భారతదేశంలోని అన్ని దేవాలయాలు హిందూ ధార్మిక పరిషత్‌లోకి రావాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. స్త్రీ , ధనాన్ని త్యజించిన వాడు మహాత్ములు అవుతారన్నారు. గురువును ప్రశ్నించేందుకు ఏ కాలంలో అయినా శిష్యులు ఉంటారన్నారు. హిందూ దేవాలయాలను మనమే కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజం కలిసి ఉండేందుకు హెచ్చు తగ్గు భావాలు తగ్గిపోవాలన్నారు. దేవాలయం అనేది కేవలం పూజలు సంబంధించి ఆధ్యాత్మిక



కేంద్రం మాత్రమే కాదని, ఇది సమాజానికి ఒక ఆయువు పట్టు లాంటిదని ఈ సందర్భంగా పలువురు పీఠాధిపతులు తెలియజేశారు. సమాజాన్ని పూర్తిస్థాయిలో చైతన్య పరిచేందుకు ఎంతోమంది మహాత్ములు ఉద్భవించిన దేశం మన భారతదేశం అన్నారు. సత్యానంద మహర్షుల వారి అధిష్టాన మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా భారతేశంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న పీఠాధిపతులు, మఠాధిపతులు రుత్వికుల పాదధూళిలో సత్యానంద ఆశ్రమం పూర్తిస్థాయిలో పునీతమైందన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ చంద్రకాళి వరప్రసాద మాతాజీ, శ్రీ లీలానంద సరస్వతి మాతాజీ, విజయవాడ శ్రీ రామకృష్ణ మందిరంకు చెందిన సిద్ధి కంఠానంద పునీత స్వాముల వారు., విజయవడ పెదపునిపాక విజయ రాజేశ్వరి పీఠాధిపతులు శ్రీ వాసుదేవానంద గిరి స్వాముల వారు. తదితరులు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సత్యానంద ఆశ్రమ పండితులు శ్రీమాన్ కోట రాజశేఖర్ శ్రీమత్ భాగవతానికి సంబంధించిన పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భారతదేశంలో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ కార్యదర్శి పోలిశెట్టి నాగేశ్వరరావు సత్యానంద ఆశ్రమం యొక్క జీవిత చరిత్రను భక్తులకు వివరించారు.

## విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

### కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,మే 3 ప్రభాత వార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పనుల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తప్పనిసరి అని కమిషనర్ వై.ఓ నందన్ శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శుల ను హెచ్చరించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ శనివారం స్థానిక 6వ డివిజన్ శెట్టిగుంట రోడ్డు, అరుంధతి పాలెం, థమ్స్ అప్ గోడౌన్స్ తదితర ప్రాంతాలలో అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో లేదని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్షయంగా వ్యవహరించిన సంబంధిత వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులకు చార్జ్ మెమోలు జారీ చేయాలని ఆదేశించా రు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో థమ్స్ అప్ గోడౌన్ సమీపంలోని స్థానికులు అందజేసిన వినతిపై విచారించిన కమిషనర్ జనావాసాల మధ్య ఉన్న పశువుల కొట్టంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇ బ్బం ద ు ల న ు గమనించారు. పశువుల శాలను జనావాసాల మధ్య నుంచి వెంటనే తరలించాలని సంబంధిత య ు జ మ ా న ు ల న ు కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు పశువుల యజమానులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి తరలింపుకు అంగీకార పత్రాన్ని తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి హెచ్చరించాలని ఫ్లోర్ పాయింట్ల వద్ద చెత్త వేసే వారికి జరిమానాలు విధించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే తడి పొడి చెత్తను విడివిడిగా అందించాలని సూచించా రు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకు నేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరు తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిసరా లను పరిశుభ్రంగా ఉంచేందు కు దోహదపడాలని కమిషనర్ సూచించా రు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొ రేటర్ మద్దినేని మస్తానమ్మ, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఏ.ఈ రమణారెడ్డి, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభా గం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తాం

### మంత్రి సత్య కుమార్ యాదవ్



**పొదలకూరు, మే 3, ప్రభాతవార్త** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడ్డాక రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. పొదలకూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సాయంత్రం ఆయన ఐదు పడకల దయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వింజమూరు, పొదలకూరులలో ఐదు పడకల దయాలసిస్ కేంద్రాలను ప్రారంభించామన్నారు. ధర్మవరం నుంచి కూటమి అభ్యర్థిగా తనను గెలిపించారన్నారు. వెంకయ్య నాయుడి నియోజకవర్గమైన ఉదయగిరిలోని వింజమూరులో దయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. వెంకయ్య నాయుడుతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. సోమిరెడ్డి కార్య సాధకుడని ప్రశంసించారు. పొదలకూరులో ప్రభుత్వం 5 పడకల దయాసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే, మరో మూడు పడకలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సొంతంగా ఇచ్చాడన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 18 దయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వెంకటగిరిలో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో 91 వేల దయాలసిస్ రోగులు తయారయ్యారన్నారు. అప్పటి కల్తీ మద్యం వల్ల రాష్ట్రంలో న్యూరో కేసులు పెరిగాయని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం లో మద్యం తాగడం వల్ల ఎందరికో కిడ్నీలు, లివర్లు దెబ్బతిన్నాయన్నారు. వాళ్లు మాత్రం ఖజానా నింపుకున్నారని విమర్శించారు. సోమిరెడ్డి కుటుంబం అల్లిపురంలో 30 కోట్ల విలువైన స్థలాన్ని స్కూళ్లకు, వైద్యశాలలకు కేటాయించిందని తెలిపారు. గత ప్రభుత్వంలో జగన్ బ్రాండ్ మద్యం తాగడం వల్ల ఒకే పంచాయతీ లో 25 మంది చనిపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. గుండెపోటు వచ్చిన వారికి 45 వేల రూపాయల విలువైన ఇంజక్షన్లను ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉంచామని తెలిపారు. వీటివల్ల ఇప్పటివరకు 2728 మంది ప్రాణాలను కాపాడినట్లు చెప్పారు. ఈ వైద్యశాలలోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక బిజెపి నాయకుడైన వీరేపల్లి శ్రీనివాసులు రెడ్డికి చెందిన గాయత్రీ విద్యా మందిర్ ను సందర్శించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు శంకుస్థాపన చేసిన హాస్పిటల్‌లో దయాలసిస్ కేంద్రాన్ని సత్య కుమార్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పొదలకూరు, చేజర్ల, కలువాయి ప్రాంతాల్లోని రోగులకు ఇది అందుబాటులో ఉంటుందన్నారు.కోటి ఎనభై లక్షల రూపాయలను సి ఎస్ ఆర్ ఫండ్ నుంచి మంజూరు చేయించి హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ వైద్యశాలకు వారం, పది రోజుల్లో జనరేటర్ పంపించే ఏర్పాటు చేస్తానన్నారు. 30 పడకల ఆసుపత్రిని 50 పడకలు చేయాలని కోరుతున్నారని, అలాగే చేస్తామన్నారు .రాష్ట్రంలో పొదలకూరు వైద్యశాల ఏపీలో మూడో స్థానంలో ఉందని తెలిపారు. ఆర్తో డాక్టర్ కావాలని అడుగుతున్నారని, ఆ డాక్టర్ను నియమించే ప్రయత్నం చేస్తానన్నారు. వెంకటాచలం పిహెచ్చికి కోటి పది లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ ఓ సుజాత, ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, పొదలకూరు మండల టిడిపి అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు , మండల బిజెపి, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.